క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ మహాలక్ష్మి, తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీఓ షబ్నా గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలోని రూమ్స్, లైట్లు, ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు, ర్యాంప్‌లను పరిశీలించి, సౌకర్యాల పై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వాల్ రైటింగ్స్‌ను పరిశీలించారు. ఎన్నికల్లో ఓటర్లకు అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

అశ్వాపురం: ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు సాధించిన అశ్వాపురానికి చెందిన విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌లో గురువారం మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సన్మానించారు. ప్రథమ సంవత్సరంలో 467 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన ఎస్‌కె.రుబీనాను, ద్వితీయ సంవత్సరంలో 988 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన గుర్రం రోహిత్‌కుమార్‌ను డీఎస్పీ శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని డీఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐ అశోక్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.ఖదీర్, మణుగూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపెద్దల ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి బోళ్ల అశ్లేష(950), ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థి కేసుపాక నవ్య(437)ను జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో షిర్డీ సాయి బాబా ఆలయంలో గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇసంపల్లి కృష్ణ, గద్దల రామకృష్ణ పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి గురువారం నామినేషన్ వేయగా.. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పిలుపు మేరకు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో ఖమ్మంకు తరలారు. వారిలో కాంగ్రెస్ నాయకులు కోటగిరి సత్యంబాబు, రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, కక్కిరాల రమేష్, అత్తులూరి వెంకటరామారావు, సాయిల నర్సీ, పర్వతనేని ప్రసాద్, కెవి సత్యనారాయణ, పగడాల రాంబాబు, యర్రగొర్ల రాధకృష్ణ, దొడ్డా ప్రసాద్, ఎర్రా వసంతరావు, చక్కిరాల మల్లేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరావు, రొయ్యల కుమార్, చినబాబు ఉన్నారు.

పలువురి పరామర్శ

ములకలపల్లి: ములకలపల్లికు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు పుష్పాల చంద్రరావు కుటుంబాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు వేర్వేరుగా పరామర్శించారు. గురువారం చంద్రరావు తల్లి ఇందిరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యేలు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబీకులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, నాయకులు పువ్వాల మంగపతి, అమర్‌నాథ్, బి.సుధాకర్, పాలకుర్తి ప్రసాద్, కొండవీటి రాజారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సత్యనారాయణ, ఏజే రమేష్, ముదిగొండ రాంబాబు, నరాటి ప్రసాద్ పాల్గొన్నారు.

వర్మకు నివాళి

భద్రాచలంఅర్బన్: అనారోగ్యంతో బుధవారం భద్రాచలం పట్టణానికి చెందిన వైద్యుడు శ్రీధర్ వర్మ మృతి చెందగా.. గురువారం ఆయన పార్థివదేహాన్ని భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు, వివిధ రాజకీయ నాయకులు, వైద్యులు, పట్టణ ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య మాట్లాడారు. భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూసల శ్రీనివాసచారి, ట్రెజరర్ బండారు రమేష్ బాబు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు ఎంవి ప్రసాద్ రావు, జిల్లా కమిటీ సభ్యులు పాయం రవివర్మ, యుగౌతమ్ కుమార్ పాల్గొన్నారు.

మరోసారి బీజేపీనే..

దుమ్ముగూడెం: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ విజయం సాధించి మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని బీజేపీ జిల్లా నాయకుడు నిడదవోలు నాగబాబు అన్నారు. గురువారం మండలంలోని రేగుబల్లి గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ నాయకుడు త్రినాథరావు, దళితమోర్చా జిల్లా నాయకులు జెట్టి వెంకట్రాజు, సతీష్, కాకరాంబాబు, శ్రీను, చలపతి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

- జంతువుల దప్పిక తీర్చేందుకు ఏర్పాట్లు
- అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్స్
- అటవీశాఖ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ



అటవీ ప్రాంతంలో నీటి వసతి ఏర్పాటు చేస్తున్న సిబ్బంది


మణుగూరు రేంజ్ పరిధిలో ఏర్పాటు చేసిన బోర్ వద్ద అటవీ అధికారులు


ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తూ..

మణుగూరుటౌన్: మండుతున్న వేసవికాలంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. అటవీ విస్తీర్ణం పెంచడంతో పాటు నాటిన మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టింది. ట్రాప్ కెమెరాల ద్వారా వన్యప్రాణుల సంచారాన్ని గుర్తించి దాహార్తి తీర్చేందుకు నీటి లభ్యత లోపం లేకుండా చూడటంతో పాటు సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా అగ్ని ప్రమాదాల నివారణతో పాటు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి మూగజీవాలు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టింది.

యాక్షన్ ప్లాన్‌తో పర్యవేక్షణ..

మణుగూరు డివిజన్ పరిధిలోని బూర్గంపహాడ్, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల్లోని 63,619.24 హెక్టార్ల అటవీ భూమిలో వన్యప్రాణుల సంచారాన్ని ట్రాప్ కెమెరాల ద్వారా గుర్తించి వాటి సంచారం ఉండే ప్రాంతాల స్థితిగతుల్లో మార్పు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. తాగునీటి గుంతల పూడిక తీసి నీరు ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు 88 బీట్లలో సమస్యాత్మకంగా ఉన్న 18 చోట్ల 25 సోలార్ బోర్‌వెల్స్ ఏర్పాటు చేశారు. వాటితో సాసర్ పిట్లు, పెర్కొలేషన్ ట్యాంకులలో నీటిని నింపుతున్నారు. మార్చి నుంచి జూన్ వరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వేటగాళ్ల నుంచి ఉచ్చులు, విల్లులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు వన్యప్రాణుల, అటవీ రక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి మూగజీవాల కదలికలు గుర్తించి తాగునీరు దొరకని పరిస్థితుల్లో డీహైడ్రేషన్‌కు గురి కాకుండా వాటి సంచారం ఉన్న ప్రాంతాలలో లవణం, మట్టి మిశ్రమాన్ని ఉంచుతున్నారు. మణుగూరు మండలంలో సింగరేణి కారణంగా జరిగే బ్లాస్టింగ్‌లకు జంతువులు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లకుండా రథంగుట్టకు మరోవైపు నీటి కొరత ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసి సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. సోలార్ బోర్లకు అవకాశం లేని నీటిగుంతల్లో పూడికలు తీసి ఎండలు ఎక్కువగా ప్రదేశాలను, నీటి లభ్యత లోపం, ఎండలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు నేరుగా వెళ్లి 10–15 రోజులకోసారి నీటిని నింపుతున్నారు. అగ్ని కీలలకు అటవి ఆహుతి కాకుండా ఫైర్ పాయింట్స్‌ను శాటిలైట్ ద్వారా గుర్తించి వెంటనే వాటిని నివారించడంతో పాటు ఫైర్ లైన్స్ ఏర్పాటు చేసి అగ్ని వ్యాప్తి తీవ్రత వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడంతో పాటు వాటి ప్రభావం వన్యప్రాణుల ఆవాసాలపై పడకుండా రేంజ్‌ల పరిధిల్లో బీట్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.


లవణం, మట్టి మిశ్రమాన్ని సిద్ధం చేసిన దృశ్యం

వన్యప్రాణుల రక్షణకు పర్యవేక్షణ



సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా మణుగూరు డివిజన్ పరిధిలో వన్యప్రాణుల సంచారం ఉన్న ప్రాంతాల్లో ఆవాసాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఈ కారణంగా అడవుల నుంచి మూగజీవాలు నీటి కోసం జనావాసాలకు వస్తాయి. ఎక్కడో ఒకచోట మాత్రమే ఉండే నీటి వద్దకు జీవరాశులు సంచరిస్తూ నీరు దొరకని సమయంలో అలసటకు గురవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని జీవరాశులకు ఇబ్బందులు ఏర్పడకుండా నీటి గుంతల్లో పూడికతీసి నీటి లభ్యత ఉంచుతున్నాం. అగ్నికి అడవి ఆహుతి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సయ్యద్ మక్సూద్, ఫారెస్ట్ డివిజన్ అధికారి

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

దుమ్ముగూడెం: మండలంలో ఏ పంచాయతీలో కూడా తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ సుధీర్‌కుమార్ ఆదేశించారు. గురువారం మండలంలోని కొత్తపల్లి, మారాయిగూడెం, రామచంద్రునిపేట, లచ్చిగూడెం, కోయనర్సాపురం, నారాయణరావుపేట గ్రామ పంచాయతీలను సందర్శించారు. కొత్తపల్లి పంచాయతీలోని గద్దమడుగు గొత్తికోయ గ్రామాన్ని సందర్శించి తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. లచ్చిగూడెం పంచాయతీలో నర్సరీ, పల్లె ప్రకృతివనం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, తాగునీటి ఎద్దడి లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీలలో నిర్వహించే రికార్డులపై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ముత్యాలరావు, పంచాయతీ కార్యదర్శులు నాగేంద్రబాబు, రంజిత్‌కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గద్దమడుగు గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సుధీర్‌కుమార్

నేడు సన్నాహక సమావేశం

దమ్మపేట: రాబోయే పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని, అశ్వారావుపేట నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశాన్ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ క్యాంప్ కార్యాలయ బాధ్యులు గురువారం ఓ ప్రకటన వెలువరించారు. ముష్టిబండ గ్రామ శివారులోని దుర్గమల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో, శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల తో పాటుగా ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకులం బాలికలు జేఈఈ మెయిన్స్‌లో తమ అద్వితీయమైన ప్రతిభ చాటారు. మొత్తం 33 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా 22 మంది జేఈఈ అర్హత సాధించారు. కళాశాల విద్యార్థులు డి.ఐశ్వర్య 79.06, కె.శ్రావణి 74.57, డి.నాగేశ్వరి 71.18, ఈ.స్వాంజిత 68.22, టి.సింధు 67.83, కె.వైష్ణవి 66.81, బి.స్నేహ 66.36, అనిత 61.61, రీతూ ప్రణయ 61.02, బి.హర్షిత 57.69, కె.చందన 55.27, అంజిత 55.16, రేవతి 54.31, పావని 53.03, జాన్సీ 52.99, సుమ లక్ష్మి 52.37, సింధు శ్రీ 58.52, పుష్ప 52.18, హరిణి 48.43, నవ్య శ్రీ 48.10, అనిత 47.77, రూప శ్రీ 46.69 శాతం మార్కులతో ఐఐటీ ప్రవేశానికి అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

'లిటిల్ ఫ్లవర్స్' విద్యార్థులు..


భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు జేఈఈ ఫలితాలలో సత్తా చాటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచారు. గురువారం విడుదలైన ఎన్‌టీఏ, జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఐఐటీలో ప్రవేశం కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరైన కేలోత్ సాహితి 76.75 శాతం మార్కులతో 5756 ర్యాంక్, భూక్య నిహారిక 57.39 శాతం మార్కులతో 9722 ర్యాంక్‌ను సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్ బాబు, డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ మాగంటి రమేష్ బాబులు అభినందించారు. అనంతరం కళాశాల ఆవరణలో ర్యాంకులు సాధించిన విద్యార్థినుల తల్లిదండ్రులను ఘనంగా శాలువాతో సన్మానించి జ్ఞాపకలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మ్యాథ్స్ అధ్యాపకులు బషీరు తదితరులు పాల్గొన్నారు


'బ్రిలియంట్' విద్యార్థులు..

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ స్కూల్ విద్యార్థి ఆదిత్య జేఈఈ మెయిన్స్‌లో జాతీయస్థాయిలో 12,678వ ర్యాంకు సాధించాడు. బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బి.నాగేశ్వరరావు గురువారం ఆదిత్యను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇంటర్ ఫలితాల్లో 'సిద్దార్థ' విద్యార్థులు..

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డ్ విడుదల చేసిన ఫలితాల్లో మణుగూరు సిద్దార్ధ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుంభి మోగించారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) విభాగంలో 500 మార్కులకు గానూ కొలువుల రచన 487మార్కులు, ఎలక స్వీటి 483 మార్కులు, కుర్సం గౌరి 476మార్కులు, ఎంఎల్‌టీ విభాగంలో గడదాసు సాయిశ్రీ 474మార్కులు మహంకాళి మానస 468మార్కులు, సింగిరెడ్డి వసుధ 438మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) విభాగంలో 1000 మార్కులకు గానూ వంక నవ్యశ్రీ 929మార్కులు, జనగం దివ్యశ్రీ 920మార్కులు, రుక్సానా 904మార్కులు, ఎంఎల్‌టి విభాగంలో జి కార్తీక్ కుమార్ 959 మార్కులు, ఎండి.ఇస్రత్ 917మార్కులు, భాగి వసుధ 906మార్కులతో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ర్యాంకులతో సత్తా చాటారు. ఏ, బీ గ్రేడ్‌లలో అనేక మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ప్రోత్సహించిన అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపల్ వల్లభనేని అజయ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల అధ్యాపకులు మమత, కల్పన, స్వాతి, ఉషశ్రీ, వెంకటేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.


భద్రాచలంటౌన్: విద్యార్థులను అభినందిస్తున్న లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు


మణుగూరురూరల్: విద్యార్థులను అభినందిస్తున్న సిద్దార్థ కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్

'అమ్మ కోసం'ను పకడ్బందీగా నిర్వహించాలి

అన్నపురెడ్డిపల్లి: అమ్మ కోసం క్లినిక్‌ను పగడ్బందిగా నిర్వహించాలని వైద్యసిబ్బందిని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్ ఆదేశించారు. గురువారం మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అమ్మ కోసం క్లినిక్, గర్భిణీ క్లినిక్‌లను పరిశీలించి సిబ్బందికి తగిన సలహాలు, సూచనాలు చేశారు. బాలింతలు అమ్మ కోసం క్లినిక్‌ను స్వదినియోగం చేసుకోవాలని కోరారు. పీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని, మలేరియా పై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, విధుల పట్ల అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పీహెచ్‌సీ ల్యాబ్‌ను తనిఖీ చేసి, శాంపిల్స్‌ను తగు సమయంలో కొత్తగూడెంలోని టీ-హబ్‌కు పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ తన్మయి, పీహెచ్ఎస్ ఎస్తేర్ రాణి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్‌వీ శారారాణి, ఫార్మాసిస్టు ప్రసాద్, ఎల్‌టీ కల్యాణ్ ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్

గ్రామాల్లో రేగా పర్యటన

మణుగూరురూరల్: మండల పరిధిలోని బుగ్గ గ్రామపంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామాలైన ఖమ్మం తోగు, బుగ్గలలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం పర్యటించారు. ఆయన అక్కడి గ్రామస్తులను పలకరిస్తూ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహరావు, బుగ్గ మాజీ సర్పంచ్ రామకృష్ణ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్యంబాబు, రామిరెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం


దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మణుగూరుటౌన్: మండలంలోని సాయినగర్‌లోని బాబా ఆలయంలో గురువారం భక్తులకు నందిగామ గోపాలరావు, దుర్గారాణి దంపతులు.. కుమారుడు సాయిగణేశ్‌లు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాత దంపతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో దోసపాటి నాగేశ్వరరావు, చక్కా బాలకేశవరావు, ఆలయ అర్చకులు పవన్‌కుమార్, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

భద్రాచలంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో గురువారం ఆలయానికి వచ్చిన భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆలయ మాజీ అధ్యక్షుడు దివంగత మాగంటి సూర్యం కుటుంబ సభ్యులు వీటిని అందజేశారు. అన్నదానానికి దాసి సరస్వతి విరాళం అందించగా ఆలయ కమిటీ ఆమెను శాలువాతో సత్కరించి బాబా వారి జ్ఞాపికను అందించేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, కోశాధికారి కుంచాల రమేష్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

మణుగూరుటౌన్: విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేసి అభివృద్ధిలోకి రావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ అన్నారు. గురువారం బీకాం, బీఎస్సీ, బీఏ ఫైనల్ ఇయర్ పూర్తయిన విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించగా.. ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు రావడం అభినందనీయమన్నారు. డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి కొత్తతరం విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనిల్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

'సంపదను లూటీ చేస్తున్న మోదీ ప్రభుత్వం'

బూర్గంపాడు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపి దేశ సంపదను లూటీ చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి ఆరోపించారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల బాండ్ల పేరుతో బీజేపీ దొడ్డిదారిన రూ 6566 కోట్లను సేకరించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈ డబ్బుతో ఓటర్లను ప్రలోభపెట్టి గెలిచేందుకు బీజేపీ కుయుక్తులు చేస్తోందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజని, ఎస్‌కె.అబీదా, బయ్యా రాము,కనకం వెంకటేశ్వర్లు, గుంటక కృష్ణ, బర్ల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించండి

చండ్రుగొండ: ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని తహసీల్దార్ సంధ్యారాణి సూచించారు. కార్యాలయంలో గురువారం నిర్వహించిన సెక్టోరల్, బూత్‌లెవల్ అధికారులతో ఆమె మాట్లాడారు. బూత్ లెవల్‌ల వారిగా పూర్తిస్థాయి సమాచారం అధికారుల వద్ద ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పనపై సరి చూసుకోవాలని, ప్రతి ఓటర్‌కు స్లిప్‌లు పంపిణీ చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వద్దన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఆర్‌ఐ అక్బర్, ఎంపీఎం సంతోష్‌కుమార్, ఏఓ వినయ్, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి


మణుగూరుటౌన్: మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరుటౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శివకుమార్ మాట్లాడుతూ.. ఒక్కరోజు డ్రైడే పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రత పాటించాలని, మలేరియాపై పోరాటం చేయాలన్నారు. డబ్ల్యూహెచ్ఓ పిలుపు మేరకు 2030 నాటికి మలేరియా నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అవగాహన కార్యక్రమంలో ఏఎంఓ గొంది వెంకటేశ్వర్లు, ఎస్‌యూఓ లింగ్యా నాయక్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

దమ్మపేట: మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ వైద్యుడు మణిదీప్ మాట్లాడుతూ.. దోమకాటు వలన మలేరియా, డెంగీ, బోదకాలు, మెదడువాపు తదితర వ్యాధులు సోకుతాయని తెలిపారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి తెలిపారు. ఒకవేళ ఆ వ్యాధులు సోకితే, వారి వివరాలను వెంటనే ఆస్పత్రిలో తెలియజేయాలని ఆశా వర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భద్రమ్మ, రామారావు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మలేరియా నివారణకు పోరాటం చేయాలని మండలంలోని వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాందాస్ నాయక్, డాక్టర్ కృష్ణ దీపక్ రెడ్డి, డాక్టర్ మధులిక అన్నారు. గురువారం ఆయా పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వేర్వేరుగా 'ప్రపంచ మలేరియా దినోత్సవం' సందర్భంగా ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. వచ్చే 2030 నాటికి భారతదేశం మలేరియా రహిత దేశంగా నిర్మించటంతో చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ దుర్గమ్మ, ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, భాస్కర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన పాల్గొని మాట్లాడారు.

మలేరియా నిర్మూలనకు వైద్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలన్నారు. మలేరియా కారక దోమల నివారణకు అధికార యంత్రాంగం, సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీ సాహితి, ఎస్‌యూఓ జీతు,సీహెచ్ఓ సోమ్లా, నాగమణి, హెచ్‌ఈఓ రవి, హెచ్ఎస్ రమణమూర్తి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చండ్రుగొండ: అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలకేంద్రం చండ్రుగొండలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి ప్రధాన సెంటర్ వరకు ఈ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో డాక్టర్ కనకం తనుజ, డాక్టర్ వెంకట్‌ప్రకాష్, సిబ్బంది శోభరాణి, లక్ష్మి, ఇమాం, పద్మ పాల్గొన్నారు.


బూర్గంపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న మోరంపల్లిబంజర పీహెచ్‌సీ సిబ్బంది


దమ్మపేట: సమావేశానికి హాజరైన ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్సులు, ఆశావర్కర్లు


అశ్వారావుపేటరూరల్: గుమ్మడవల్లిలో అవగాహన ర్యాలీ


చండ్రుగొండలో వైద్య సిబ్బంది ర్యాలీ..